# విరోధి : ఉగాది

- వేమూరి వేంకట రామనాధం

క. భయ మొదవజేయు నామము
గయికొని యరుదెంచినావు గాదె విరోధీ,
నయశీలురైన జనుల క
భయమిచ్చెడు కాలచలనబంధుర లక్ష్మీ.

క. దినము దినమ్మును లోతులు
కనిపించని రీతి పొంగు కల్మషమునకున్
కనకము గుంజుకొనెడి దు
ర్జనత్వమునకున్ విరోధ సరణిని రమ్మీ.

క. చుట్టలు చుట్టుకు పాపము
పుట్టలుగా పెరుగుచున్న భూగర్భములో
చెట్టకు విరోధి వంతున
చిట్టి సుధాబిందు వట్లు చెలరేగ గదే!

క. అక్షయరీతిని విశ్వ
ప్రేక్షకుడగు కాలపురుష విచలిత ధృతిగా
లక్షణ రహితుల పయి హ
ర్యక్షముగా గంతులెత్త రావె విరోధీ.

క. స్వార్ధము పైనను, సంఘా
నర్ధకర క్రియలపైన, నతిశయ హతమౌ
వ్యర్ధ వినోద నిరతిపై
నర్ధయుతాంక్షలను నిల్పుమమ్మ విరోధీ.

క. మాకను ఱెప్పల యంచుల
నీ కోమల మందహాసనిక్షేపమ్ముల్
సోకి నవీనానుభవో
ద్రేకమ్ములుగాదిలక్ష్మి, రేగినవమ్మా.

క. పేరున కీవు విరోధివి
ధారుణిని నవప్రసన్నతారుచులొల్కన్
చేరిన దివ్యజ్యోతివి
హారతి నొసగెదము మాహృదంతర శుద్ధిన్

## అర్ధములు

1. నయశీలురు = మృదువైన స్వభావము కలవారు. బంధుర = వంగిన; 3. చిట్టి = చిన్న
4. అక్షయ = తగ్గుదలలేని ధృతి = సంతోషము లక్షణరహితులు = గురి(చూపు) లేనివారు. హర్యక్షము = సింహము
5. అతిశయహతమౌ = ఆధిక్యము వలన దెబ్బవడ్డ. నిరతి = మిక్కిలి ఆసక్తి. ఆంక్ష = వెలివేయుట.
6. నిక్షేపమ్ములు = నిధులు .
7. హృదంతర = హృదయములోని.